# ఎక్కవలసిన రైలు

## – సత్యం మందపాటి



"సాహితీ సిరికోన" వారి ఆధ్వర్యంలో నిర్వహించిన "శ్రీ జొన్నలగడ్డ రాంభొట్లు- సరోజమ్మ స్మారక పురస్కారం" బహుమతి అందుకున్న నవల.

*(గత సంచిక తరువాయి)*

10

**ఎపార్ట్మెంట్** సిద్ధమయిందని ఫోన్ వచ్చింది రేఖకి.

"ఆంటీ, రేపు ప్రొద్దున్నే అక్కడికి వెళ్ళిపోతాం" అంది రేఖ.

"ఎందుకమ్మా అంత తొందర. ఇక్కడ మీరు కొన్నాళ్ళు వుండవచ్చు. మాకు ఇక్కడ మీరుంటే సందడిగా బాగుంది కూడాను" అన్నది వీణ.

"ఇక్కడ మేము ఎన్నాళ్ళు వున్నా, ఏదో ఒక రోజు వెళ్ళవలసిందే కదా. అది ఇప్పుడే వెడితే త్వరగా సెటిలవవచ్చు" అంది రేఖ.

"అవును, అక్కయ్యగారు. మీకు మేమెవరమో తెలియకపోయినా ఇప్పటికే ఎంతో శ్రమ తీసుకుని మమ్మల్ని ఇక్కడ వుంచుకుని మీ స్వంత కుటుంబంలా ప్రేమగా చూసుకున్నారు. అది ఎన్నటికీ మరచిపోలేము. రేపు వెడతాము. మళ్ళీ మేమూ వస్తాము. మీరూ వద్దురుగాని" అన్నది రాజేశ్వరి.

"అయితే రేపు లంచ్ తిన్నాక వెడుదురుగాని. వేణు మిమ్మల్నక్కడ దించుతాడు" అన్నది వీణ.

ఈలోగా వేణు కూడా ఆఫీసునించీ వచ్చి వాళ్ళ సంభాషణ విన్నాడు.

"రేఖా, మళ్ళీ నువ్వు ఆఫీసుకి ఎప్పటినించీ వెళ్ళాలి" అని అడిగాడు.

"ఇంకొక వారం రోజుల్లో. అంటే రాబోయే సోమవారం నించీ. అందుకే ఈలోగా అక్కడికి వెడితే, ఆఫీసు మొదలయే లోపల నాకూ, అమ్మకూ కూడా కొంత అలవాటవుతుంది కదా అంకుల్" అన్నది రేఖ.

“నీ ఇష్టం రేఖా. నీకు ఎలా చేస్తే బాగుంటుంది అనుకుంటావో అలాగే చేద్దాం. వీణ అన్నట్టు రేపు లంచ్ అవగానే వెడదాం. నాకు కూడా ఆఫీసులో రేపు మధ్యాహ్నం అంతగా పనిలేదు. నేను రాగలను” అన్నాడు వేణు.

“వద్దు అంకుల్, మేము వెళ్ళగలం” అంది రేఖ.

“అన్ని పెద్ద సూట్కేసులు రెండు అంతస్థులు మోసుకువెళ్ళద్దూ. అసలే బాలింతరాలివి. మనవేపు ప్రసవం అయాక నెల రోజుల దాకా కదలనీయరు. నీకెందుకు అంత శ్రమ? నేనూ వేణూ ఇద్దరం వస్తాం. ఏం ఫరవాలేదు” అన్నది వీణ.

సరే అనక తప్పలేదు రేఖకి.

“మీరు కట్టుబట్టలతో ఇక్కడికి వచ్చేశారు. కొత్త సంసారం అంటే మాటలా! ఎన్నో వంట సామాన్లు, తినటానికి ప్లేట్లు, గ్లాసులూ మొదలైనవే కాక, టవల్సూ దుప్పట్లూ, దిళ్ళూ... ఒకటా రెండా ఎన్నో కావాలి. మంచాలు, పరుపులూ కొనుక్కునే దాకా కనీసం స్లీపింగ్ బాగులన్నా కావద్దూ. అసలే సుమ పసిపిల్ల. మా దగ్గర మేము ఎన్నడూ వాడనివో, చాల కొద్దిగా వాడినవో చాల గిన్నెలూ, గ్లాసులూ, పళ్ళాలూ ఇలా ఎన్నోవున్నాయి. నీకు కావలసినవి అన్నీ తీసుకు వెళ్ళు. తర్వాత నువ్వు కొత్తవి కొనుక్కున్నాక అవి ఇంకెవరికైనా ఇచ్చేయి. నీ ఇష్టం. ఈ దేశంలో ఇది మామూలే. అలాటి ముఖమాటాలు లేవు” అంది వీణ.

వేణు నవ్వుతూ, ”అంతేకాదు, వీణ ఎక్కడ ఏది రెడ్ టాగ్ సేల్లో వుంటే అది కొనేస్తుంది. అవసరమా, అనవసరమా అన్నది మాకు అనవసరం. దుప్పట్లూ, దిళ్ళూ, గలీబులు, కంఫర్టర్లూ, ఇంకా ఏదైనా సరే ఇక్కడ కావలసినవారికి ఉచితముగా లభించును” అన్నాడు.

రేఖ నవ్వి, “నేను నెమ్మదిగా అవన్నీ కొనుక్కుంటాను అంకుల్. మీకు గెస్టులెవరైనా వస్తే కావాలి కదా” అన్నది.

“వాళ్ళకీ వున్నాయి. ఏమీ ఫరవాలేదు. నీకు వెంటనే కావలసినవన్నీ ఇప్పుడే ఒక పక్క అట్టపెట్టెల్లో పెడదాం. రేపు నా కారులోనూ, వేణు కారులోనూ రెండిటిలోనూ తీసుకువెడదాం. అదీ చాలకపోతే రెండు ట్రిప్పులు వేద్దాం. సరేనా” అంది వీణ.

“ఇవాళ ఇండియన్ గ్రోసరీ కొనుక్కొద్దాం. రేపు అమెరికన్ గ్రోసరీకి వెడదాం. వారం, పది రోజులకి సరిపడా కొనేస్తే మంచిది” అన్నాడు వేణు.

“మళ్ళీ మళ్ళీ చెబుతున్నానని అనుకోవద్దు. నాకు మీకు ధన్యవాదాలు ఎన్నిసార్లు చెప్పాలో, ఎలా చెప్పాలో కూడా తెలియటం లేదు” అన్నది రాజేశ్వరి, కళ్ళల్లో నీళ్ళు తుడుచుకుంటూ.

వీణ “రాజేశ్వరీ, నువ్వు నన్ను అక్కయ్య అని పిలిచావు. అక్కయ్యకి చెల్లి అన్నిసార్లు ధన్యవాదాలు చెప్పకూడదు. ఆయుక్షీణం!” నవ్వుతూ అన్నది, ఆమె భుజం మీద చేయివేసి దగ్గరికి లాక్కుంటూ.

“అదేం కాదుగానీ, నిన్న చెప్పానుగదా. మేము అమెరికాలో మా కాళ్ళ మీద మేము నిలబడేదాకా మాకు ఒక కుటుంబం ఎంతో సహాయం చేశారు. వాళ్ళకి కూడా మేమెవరమో తెలియదు. మేము చేస్తున్నది కూడా అదే. కొన్నేళ్ళ తర్వాత మీకూ అలాటి అవకాశం వస్తుంది. వాళ్ళకప్పుడు సహాయం చేస్తూ, మమ్మల్ని ఒక్కసారి గుర్తు చేసుకోండి, చాలు. మనిషిగా పుట్టినందుకు మనిషిగా జీవించాలి కదూ!” అన్నాడు వేణు.

అప్పుడే ప్రకాష్ దగ్గరనించీ ఫోన్ వచ్చింది.

వేణు జరిగినదంతా చెప్పాడు.

“అలాగే రేఖ ఏమనుకుంటే అదే చేద్దాం. రేఖ బాంక్ ఎకౌంట్ నెంబరిస్తే, నేను కొంత డబ్బు ఇప్పుడే ఆమె ఎకౌంటుకి పంపిస్తాను. ఇప్పుడే ఆమెకి డబ్బు అవసరం” అన్నాడు.

“నేనిస్తానులే” అన్నాడు వేణు.

ప్రకాష్ నవ్వాడు “నేనూ, నువ్వూ ఇద్దరం ఇద్దాం. అంతేకాదు నేను ఇక్కడ నా స్నేహితుల దగ్గర కూడా, రేఖ వివరాలు గుప్తంగా వుంచి, ఆమె కథ మాత్రం చెప్పి, సహాయం చేయమని అడుగుతాను. ఎంతమంది ఇస్తే అంతమంది” అన్నాడు.

“గుడ్ ఐడియా. అలాగే చేద్దాం. ఉండు. రేఖకి ఫోన్ ఇస్తాను. ఆ ఎకౌంట్ వివరాలు అన్నీ నువ్వే అడిగి తెలుసుకో” అని రేఖకి ఫోన్ అందించాడు వేణు.

రేఖ ఫోనులో మాట్లాడుతుంటే, రాజేశ్వరి, వీణ, వేణు ఆమె కొత్త సంసారానికి కావలసిన సామాన్లు ముందుగదిలో ఒక పక్కగా పెడుతున్నారు.

మర్నాడు అనుకున్నట్టుగానే ఎపార్ట్మెంటుకి వెళ్ళారు. వేణు పెద్ద సూట్కేసులు మేడ మీదకి తెస్తుంటే, రేఖా, రాజేశ్వరీ, వీణా చిన్న చిన్న పెట్టెలు పైకి తీసుకువచ్చారు. సుమ మాత్రం అక్కడ బెడ్రూములో వేసిన స్లీపింగ్ బాగ్ మీద ప్రశాంతంగా నిద్రపోతున్నది.

“బంగారుకొండ! మనల్ని ఇబ్బంది పెట్టకుండా ఎంత హాయిగా పడుకున్నదో చూడండి. నిన్ననే సుమకి చెప్పాను. రేపు మనకి మంచిరోజు, మనం మన ఎపార్ట్మెంటుకి వెళ్ళబోతున్నాం, నీ సహాయం కావాలి అని. అది ఒక చిరునవ్వు విసిరింది” అన్నది రేఖ.

రేఖ అలా అంటుంటే ముచ్చటగా వుంది వీణకి.

రేఖ నుదుటి మీద ముద్దు పెడుతూ, “అవును, సుమ కూడా నీలాగానే మంచి పిల్ల” అంది.

ఆడవాళ్ళు ముగ్గురూ తెచ్చిన కొద్ది సామాన్లూ ఇంట్లో సర్దుతుంటే, రేఖ ఇచ్చిన లిస్ట్ తీసుకుని దగ్గర్లోనే వున్న అమెరికన్ గ్రోసరీ షాపుకి వెళ్ళాడు.

అతనటు వెళ్ళగానే, లీసా కూడా వచ్చి వాళ్ళకి సహాయం చేస్తున్నది. ఆమె చేతుల్లో కూడా రేఖకి అవసరమయే సామాన్లు కొన్ని వున్నాయి.

అన్నీ సర్దాక వేణు "ఇక వెడతాం రేఖా. నీకు ఏది అవసరమైనా, ఎప్పుడైనా సరే నాకు ఫోన్ చేయి" అన్నాడు.

లీసా నవ్వుతూ, "ముందు నన్ను పిలుస్తుంది. ఆ తర్వాతే మీరు" అన్నది.

వీణ కూడా నవ్వుతూ, "తప్పకుండా, నువ్వు పక్కనే వుంటావుగా" అన్నది.

## 11

పని చేస్తున్నదేగానీ సమీర మనసు పరిపరి విధాలుగా పోతున్నది.

ఇంతకుముందు తను డేటింగ్ చేసిన ఇద్దరు ముగ్గురు సరిగ్గా ఇలాగే చేశారు. బాగానే వున్నారని అనిపించే సమయంలో హఠాత్తుగా కనిపించక పోవటం, తర్వాత మళ్ళీ కలిసి ఏవో కుంటిసాకులు చెప్పటం. వారిలో నిజాయితీ అసలు కనపడలేదు. అందుకే వాళ్ళు చెప్పిన కారణాలు సరైనవా కావా అని కూడా చూడకుండా తనూ ముఖం చాటేసింది.

ఇతనూ అలాటి వాడేనేమో!

మళ్ళీ అనుకున్నది నిక్ అలా కాదేమో. అతను నిజంగానే వేరే పనిమీద బాగా బిజీ అయిపోయాడేమో! మరి అలా అయితే తనింతకుముందు వదిలేసుకున్న

వాళ్ళు కూడా చెడ్డవాళ్ళు కాదేమో!

ఇక్కడ డేటింగుల్లో తనెంతోమందిని చూసింది. దాదాపు అందరిలోనూ ఏదో ఒక లోపం. ఎవరూ నచ్చలేదు. తను ఎటూ నిర్ణయించుకోలేకపోయింది.

ఒక స్నేహితురాలు 'యు ఆర్ వెరీ స్లో ఇన్ డెసిషన్ మేకింగ్' అన్నది. ఇంకొక స్నేహితురాలు "నువ్వు స్లో ఒకటే కాదు, సరైన నిర్ణయాలు కూడా తీసుకోవేమో. అందుకే నువ్వు పది షాపులు తిరిగి ఒక డ్రస్ కొనుక్కుంటావు. రెండు రోజులు ఆగి ఆ డ్రస్ బాగాలేదని తిరిగి ఇచ్చేస్తావు. ఏదో ఒకసారి అయితే ఫరవాలేదు. అదే చాలసార్లు చేస్తుంటే, ఎక్కడో ఏదో సరిగ్గా జరగటం లేదన్నమాట. ముందే సరైన నిర్ణయం తీసుకుంటే ఆ తిప్పికొట్టే గొడవే వుండదు కదా అని తనతోనే సూటిగా అంది. అందుకే తను వాళ్ళిద్దరితోనూ స్నేహాన్ని తెంపేసుకుంది. ఎన్నాళ్ళయిందో వాళ్ళతో మళ్ళీ మాట్లాడి.

తర్వాత విసుగుపుట్టి కొన్నాళ్ళసలు డేటింగులే మానేసింది.

అప్పుడే తన చిన్ననాటి స్నేహితురాలు వనజ ఇండియాకి అలా వెళ్ళి, ఇలా పెళ్ళి చేసుకువచ్చింది. ముక్కూ ముఖం తెలియని అతన్ని పెళ్ళి చేసుకున్నా, ఇప్పటికి నాలుగేళ్ళుగా చాల సుఖంగా వుంది. దాని మాటలు వినే, అది చూసే తను కూడా ఇండియాకి వెళ్ళి మధుని పెళ్ళి చేసుకుంది. కానీ అక్కడా అడ్డంకులే వచ్చాయి.

వనజ కూడా రెండు, మూడుసార్లు తనకి కొన్ని ఉపన్యాసాలు ఇచ్చింది. సంసారం అంటే ఎడ్జెస్టమెంట్లు వుండాలనీ, ఇచ్చిపుచ్చుకోవాలనీ, అంగీకారం వున్నా లేకపోయినా ఒకళ్ళ భావాలింకొకళ్ళు గౌరవించాలనీ ఇంకా ఏవో చాల చెప్పింది. ఆ కబుర్లు వినే ఉత్సాహం లేక వనజతో కూడా మాట్లాడటం తగ్గించింది.

నిక్ అలాటి వాడు కాదేమో!

చూద్దాం, సాయంత్రం కలుస్తానుగా అనుకుంది.

ఆరోజు తొందరగానే గదికి వచ్చేసింది.

ఐదున్నరకల్లా సిద్ధమయి, అతని కోసం ఎదురు చూస్తూ మాటిమాటికీ కిటికీలోనించీ బయటకు చూస్తూ గదంతా తిరుగుతున్నది.

ఆరయినా అతను రాలేదు.

ఆరున్నరయినా అతను రాలేదు.

సమీరలో ఓర్పు తగ్గుతున్నది.

అతని మీద కోపం ఎక్కువవుతున్నది.

అప్పుడే డోర్ బెల్ కొట్టాడు నిక్.

చటుక్కున లేచి తలుపు తెరిచింది సమీర.

నిక్ లోపలికి వచ్చాడు.

అతని చేతిలో పెద్ద కాగితం సంచి.

"అదేమిటి?" అడిగింది సమీర.

నవ్వాడు నిక్. "మళ్ళీ బయటికి ఏం వెడతాం అని ఇండియన్ రెస్టారెంటులో నీకూ, నాకూ డిన్నర్ తెచ్చాను. అందుకే ఆలస్యమయింది. మాట్లాడుకుంటూ తిందాం" అన్నాడు.

"అందుకా ఆలస్యం" అంది సమీర.

నిక్ తనంతట తనే అక్కడ అన్నీ సర్ది, "లెట్స్ ఈట్" అన్నాడు.

తింటుండగా అడిగింది సమీర.

"ఇప్పుడు చెప్పు. నాలుగురోజులుగా ఎందుకు మాయమయావు, ఎక్కడికి వెళ్ళావు?"

“అదంతా ఒక పెద్ద కథ. సత్యాన్వేషణ కోసం వెడతానన్నాను కదా! అదే చేస్తూ, ఇక్కడికి నలభై మైళ్ళ దూరాన వున్న ఒక ఆశ్రమానికి వెళ్ళాను”

“ఏమిటి, హిందూమతం మీదకి మళ్ళిందా నీ మనసు?” అడిగింది.

“లేదు. నాకు, ఏ మతమైనా సరే, మతాల మీద అసలు నమ్మకం లేదు. నా నమ్మకం అంతా మనుష్యుల మీదే. మానవత్వం వున్న మనుష్యుల మీద. ఆశ్రమంలో బోధించే విషయాలు కొన్ని మత సంబంధం కావచ్చుగానీ, నేను వెళ్ళిన ఆశ్రమం ఏ మతానికీ సంబందించినది కాదు. అది నాలుగు రోజుల కాంప్. అక్కడ మెడిటేషన్, యోగాలాటివి వున్నాయి. కొన్ని వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలున్నాయి. ఒక జంతు రక్షణశాల కూడా వున్నది. అక్కడ ఆవులే కాదు, రకరకాల సాధు జంతువులని తీసుకువచ్చి పెంచుకుంటారు. వాటిలో కొన్ని దెబ్బ తిన్నవి, కొన్ని మనుష్యులు చేసిన హింసకు గురి అయినవీ. వాటికి కావలసిన వైద్య సహాయం చేసి ఎంతో జాగ్రత్తగా చూసుకుంటారు. పేదవారికే కాక, అక్కడికి వచ్చిన అందరికీ ఉచిత భోజనాలు పెడతారు. అక్కడే కాదు, చుట్టుపక్కల వూళ్ళల్లో వున్న బీదవారికి కూడా అన్నదానం చేస్తుంటారు. చదువులు చెప్పిస్తుంటారు. వాళ్ళకి కావలసిన అన్ని కూరలూ పండించుకుంటారు. వాళ్ళ పాలూ, పెరుగూ కూడా అక్కడే. మనం ఏదైనా ధన సహాయం చేస్తే తీసుకుంటారు, లేకపోతే లేదు. మానవత్వం నిత్య నూతనంగా వెలిగిపోయే ప్రదేశం అది. అక్కడ ఎక్కడ చూసినా మానవత్వపు సౌరభాలు గుబాళిస్తుంటాయి. మనిషిగా పుట్టినందుకు, నిజమైన మనిషిగా ఎలా బ్రతకాలో చూపించే ఆశ్రమం అది. నా సత్యాన్వేషణకి సమాధానం అక్కడే కనపడింది. అక్కడ జరుగుతున్నవేవీ డబ్బుతో కొనలేము. ప్రొద్దున్న ఐదు గంటలనించీ, రాత్రి పదిదాకా ఎన్నో కార్యక్రమాలు. పది గంటలకల్లా అందరూ తప్పక నిద్రపోవలసిందే. అక్కడికి వెళ్ళగానే, మన దగ్గర వున్న సెల్ ఫోన్లూ, ఐపాడ్లూ అన్నీ తీసేసుకుంటారు. మళ్ళీ ఇంటికి వెళ్ళబోయే ముందరే అవి మనకి ఇస్తారు. అందుకే నీ కాల్స్ తీసుకోలేదు” అన్నాడు నిక్.

అతను చెప్పేటప్పుడు అతని కళ్ళు మెరుస్తున్నాయి.

భాష్పాలతో కాదు, ఏదో కొత్త సత్యాన్ని కనుక్కున్నాననే భావనతో కలిగే మెరుపుతో!

సమీరకి అతని ఉద్వేగం చూస్తుంటే, ఆమె మనసు కూడా ఉప్పొంగుతున్నది.

“నీకు వీటి మీద ఎలా వచ్చింది ఈ సరదా?”

“ఎప్పటినించో అనుకుంటున్నాను మన శరీరం, మనసు, బాడీ అండ్ సోల్ గురించి తెలుసుకోవాలని. నా ఉద్దేశ్యంలో సోల్ అంటే చనిపోయాక విశ్రాంతి తీసుకునే ఆత్మో, మళ్ళీ ఇంకొక శరీరంలోకి వెళ్ళే ఆత్మో కాదు. మనలోనే అంతర్గతంగా వుంటూ, అవసరం వచ్చినప్పుడు మనల్ని తట్టి లేపే మన మనసు. అది నా ఫేవరేట్ సబ్జెక్ట్. ఇప్పుడీ అవకాశం వచ్చింది. ఉపయోగించుకుంటున్నాను. కొన్నాళ్ళకి ఎప్పుడో మళ్ళీ ఇక్కడికే వస్తానేమో” అన్నాడు నిక్.

కళ్ళార్పకుండా అతన్నే సాదరంగా చూస్తున్నది సమీర.

మళ్ళీ అన్నాడు నిక్. "రాబోయే సోమవారం ఇక్కడ దుకాణం కట్టేసి లండన్ వెళ్ళి బాబ్ జెస్సికాలతో గడుపుతాను. శనివారం అమెరికా వెళ్ళిపోయి, శాన్ డియాగోలో నా స్వంత కౌన్సెలింగ్ సైకాలజీ ప్రాక్టీస్ మొదలుపెట్టాలి. అందుకే ఇంత హడావిడిగా నేను నా సత్యాన్వేషణకి వెళ్ళటానికి కారణం" అన్నాడు.

సమీర మనసు ఒక్క క్షణం తేలికపడింది.

మరుక్షణం అతను వెళ్ళిపోతున్నాడంటే బాధ పడింది.

"అప్పుడే వెళ్ళిపోవాలా" అంది అసంకల్పితంగా.

"అప్పుడే ఏమిటి, వచ్చి రెండు నెల్లయింది. ఇది నా బిజీ జీవితంలో అరుదైన పెద్ద వెకేషన్" అన్నాడు.

సమీర మనసులో ఏమిటో దిగులుగా వుంది.

అది గమనించిన నిక్ అన్నాడు, "ఒక పని చేద్దాం. నేను రేపు స్ట్రాట్ఫర్డ్ వెడదామనుకుంటున్నాను. అక్కడే షేక్స్పియర్ పుట్టిన ప్రదేశం స్ట్రాట్ఫర్డ్ అపాన్ ఏవాన్ వుంది.
అది చూసి రేపు సాయంత్రానికి వెనక్కి వచ్చేస్తాను. నీకు వీలుంటే నాతోపాటు రావచ్చు" అని.

వెంటనే ఒప్పేసుకుంటే చులకనైపోతానేమో అని అనుకుందిగానీ, తన మనసు వెళ్ళమని చెబుతుంటే, "సరే, వస్తాను. ఇద్దరం కలిసే వెడదాం" అంది.

నిక్ కూడా ఉత్సాహంగా, "సరే, రేపు ప్రొద్దున్న ఎనిమిది గంటలకల్లా వచ్చేస్తాను. సిద్ధంగా వుండు. ట్రయిన్లో వెడదాం" అన్నాడు.

మర్నాడు ఇద్దరూ కలసి ట్రయిన్లో స్ట్రాట్ఫర్డ్ వెళ్ళారు.

స్ట్రాట్ఫర్డ్ అపాన్ ఏవాన్లో పదహారవ శతాబ్దంలో షేక్స్పియర్ పుట్టిన ఇల్లు, ఏవాన్ నది, దాని ఒడ్డునే వున్న రాయల్ షేక్స్పియర్ థియేటర్, దాని పక్కనే వున్న స్వాన్ థియేటర్ చూశారు. అక్కడికి కొంచెం దూరంగా వున్న సీతాకోక చిలుకల తోట చూస్తూ, ఆ రంగురంగుల సీతాకోక చిలుకలు తమ మీదా, తమ దుస్తుల మీదా వ్రాలుతుంటే చిన్న పిల్లల్లా గంతులు వేస్తూ తిరిగారు.

ఏవాన్ నదీ తీరాన నడుస్తున్నప్పుడు, సమీర "నిక్ పిలవగానే ఒప్పుకుని రావటం, అతనితో రోజంతా ఇంత ఆనందంగా గడపటం తన జీవితంలో మరువలేనిది. అతను చాల స్నేహంగా వుంటాడు. ఎంతో మంచివాడు" అనుకున్నది.

"నువ్వు సైకాలజీ ప్రాక్టీస్ ఏ విషయం మీద చేస్తున్నావు. నీ క్లయంట్స్ ఎలాటి సమస్యలతో నీ దగ్గరకు వస్తారు" అడిగింది.

నిక్ నవ్వాడు. "అన్నీను. క్లయంట్స్ వివరాలు చెప్పకూడదు. అవన్నీ ప్రైవసీకి సంబంధించినవి కదా" అన్నాడు.

సమీర ఏదో ఆలోచనలో పడింది.

“ఏమిటి, ఆలోచిస్తున్నావు?” అడిగాడు.

నిక్ వృత్తిపరంగా వ్యక్తుల మనసు చదవగలడు.

సమీర మనసులోని మాటలు అతనికి అర్థం అవుతున్నాయి కూడాను. అయినా ఆమె ఆలోచనా సరళి ఎక్కడికి దారి తీస్తున్నదో చూద్దామని అడిగాడు.

“ఏమీ లేదు. ఇక వెడదామా?” అని అడిగింది.

బర్మింగ్హాంలో ట్రయిన్ దిగి తన ఎపార్ట్మెంటుకి వెడుతున్నప్పుడు సమీర మనసులో ఒకటే దిగులుగా వుంది. నిక్ మళ్ళీ కనపడడు. తర్వాత ఎప్పుడో అతన్ని కలవటం.

అమెరికా వెళ్ళినా తను వుండేది చికాగోలో. అతను వుండేది శాన్ డియాగోలో. అతనితో ఇంకా ఏదో చెప్పాలని అనుకుంది.

కానీ తనకి అభిమానం అడ్డం వచ్చింది.

కొంచెం వెనగ్గా అతన్ని చూస్తూ నడుస్తున్నది సమీర.

నిక్ ఆమె తననే చూస్తున్నా, గమనించనట్టు మెల్లగా నడుస్తున్నాడు.

తన ఎపార్ట్మెంటు రాగానే, ”ఇక మళ్ళీ ఎప్పుడో మనం కలవటం, తప్పకుండా మళ్ళీ కలుద్దాం” అంది.

“తప్పకుండా కలుద్దాం. విల్ బి ఇన్ టచ్” అని ఆమెని కౌగలించుకున్నాడు నిక్.

అతను వెళ్ళిపోతుంటే వెనుతిరిగి చూసింది సమీర.

అతను గంభీరంగా నడుస్తూ కనుమరుగైనాడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments